# దైవవిరోధ గుణముల నుండి విడుదల
# మరియు దేవునితో నిబంధన కొరకు - ప్రార్థన - 05

ప్రభువైన దేవా, యెహోవా! నజరేయుడైన యేసు నామమున
నీకు కృతజ్ఞతాస్తుతులు, స్తోత్రములు.

సర్వశక్తిమంతుడా సర్వాధికారి! నీ క్రియలు ఘనమైనవి, ఆశ్చర్యమైనవి;
యుగయుగములకు రాజా నీ మార్గములు న్యాయములును,
సత్యములునైయున్నవి.
అందునుబట్టి నీకే స్తోత్రములు.

ప్రభువైన దేవా! తరతరముల నుండి నన్ను వెంబడించుచున్న
భయము నుండియు, ఆందోళన మనస్సునుండియు,
ఫోబియా నుండియు
షార్ట్ టెంపర్ నుండియు,
మితిమీరిన కోపం నుండియు,
అబద్ధములాడే పెదవుల నుండియు,
ఇతరులను మోసం చేసే కుయుక్తి నుండియు,
అనవసరమైన అనుమానముల నుండియు,
క్షమించలేని గుణముల నుండియు,
ఇతరులను నిందించే స్వభావము నుండియు,
ద్విమనస్కు నుండియు, స్వనీతి నుండియు,
ఈర్ష్య - పగ - ద్వేషం నుండియు,
అభద్రతాభావము నుండియు
క్రీస్తు ప్రేమకును, క్రీస్తు మనస్సుకును,
క్రీస్తు స్వభావమునకును వ్యతిరేఖముగా
నాలో వుండే ప్రతివిధమైన దుర్గుణములనుండియు
యేసయ్య! నేను విడుదలను పొందగోరుచున్నాను.

యేసయ్యా! నన్ను క్షమించండి,
యేసయ్యా! నన్ను శుద్ధినిగా చేయండి.

ప్రభువా! నాకు కావలసిన ధైర్యమును, సమాధానమును,
దీర్ఘశాంతమును, క్షమించే హృదయమును,
ఇతరులను అర్థం చేసుకునే మంచి స్వభావమును,
ప్రార్థనలో ఏకాగ్రతను, నిస్వార్థమును,
నీకు కలిగిన మనస్సును దేవా, నాకు దయచేయండి.

ప్రభువైన దేవా, యేసయ్య!
నేను నీతో నిబంధన చేసుకొనిచున్నాను.
నీవే నా రక్షకుడవు,
నీవే నా విమోచకుడవు,
నీవే నా ప్రాణ ప్రియుడవు,
నీ ద్వారానే నాకు నిత్యజీవము.
ప్రభువైన యేసు! పరలోకమునకు నీవే మార్గము, సత్యము,
జీవము అని నేను నమ్ముచున్నాను.
యేసయ్య! నీవలె నన్ను ప్రేమించేవారు ఎవరున్నారు?

యేసయ్యా! నిన్ను నా స్వరక్షకునిగా నేను అంగీకరించుచున్నాను.
యేసయ్య, ఇకనుంచి నీ ద్వారా నేను దేవునికి వారసుడ నగుచున్నాను.
యేసయ్య, నీ కృప ద్వారానే నేను నిత్యజీవమునకు వారసుడ నగుచున్నాను.

యేసు నామములోనే దినదినము నేను ఆశీర్వదించబడుదును గాక.
యేసు నామములోనే దినదినము నేను ఆరోగ్యమును పొందుకొందును గాక.
యేసు నామములోనే దినదినము నేను ఆర్థికాభివృద్ధిని,
సమృద్ధిని పొందుకొందును గాక..
యేసు నామములోనే దినదినమునకు కావలసిన
సమాధానమును నేను పొందుకొందును గాక.

ప్రభువైన దేవా! ప్రతి విధమైన సాతాను కనుదృష్టిని
నా మీదనుండి సంపూర్ణముగా రూపుమాపి,
నీ సర్వాంగ కవచమును నాకు ధరింపజేయుమని యేసునామములోనే
ప్రార్థించి స్తుతించి వేడుకొనుచున్నాను తండ్రి. ఆమేన్.

సమకూర్పు:
దైవజనులు డా.. ఇమ్మానుయేలు సన్నిధి, ఎల్లద్దాయి.